క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: బీడీ కార్మికుల పిల్లలకు 2025–26 సంవత్సరానికి గాను ప్రోత్సాహక ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీడీ కార్మికుల ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ తెలిపారు. ప్రీ మెట్రిక్, 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారు ఆగస్టు 31 వరకు, పోస్ట్‌మెట్రిక్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ చదువుతున్న వారు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 040–25561297 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ నాయకులు కోరారు. వికసిత్ భారత్, ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలన సందర్భంగా మండలంలోని అయితిపల్లి గ్రామంలో సీతారామాలయం, దోమలకుంటలో బీరప్ప ఆలయాల ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. జిల్లా అధికార ప్రతినిధి సత్యం, మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు కొమురెల్లి, మల్లేశం, గట్టయ్య, కాకర్ల సతీశ్, కుమారస్వామి, హరీశ్, తిరుపతి, అభిలాష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న వేణుగోపాలచార్య తదితరులు

జగిత్యాలటౌన్: బ్రాహ్మణ పరిషత్ 19వ వార్షికోత్సవ కరపత్రాన్ని గురువారం జిల్లా కేంద్రంలో ప్రముఖ జ్యోతిష్య పండితులు నంబి వేణుగోపాలచార్య కౌశిక ఆవిష్కరించారు. జూలై 6న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వార్షికోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాంప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి ఎస్సైగా కృష్ణసాగర్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై

గొల్లపల్లి: గొల్లపల్లి ఎస్సైగా కృష్ణసాగర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సతీశ్ జగిత్యాలకు బదిలీపై వెళ్లగా నిర్మల్ జిల్లా కడెం పోలీస్‌స్టేషన్ నుంచి కృష్ణసాగర్‌రెడ్డి బదిలీపై వచ్చారు.

కాంగ్రెస్ హయాంలోనే రైతులకు మేలు



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి: కాంగ్రెస్ హయాంలోనే రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వాకిటి సత్యంరెడ్డి, ఖుత్బుద్దీన్‌పాషా తదితరులున్నారు.

బైక్‌లో మంటలు

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గురువారం నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి బుల్లెట్ వాహనంపై వెళ్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అతడు వెంటనే వాహనాన్ని నిలిపివేశాడు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

కమిషన్‌కు ఫిర్యాదు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లో గల పాఠశాలలో దారుణ పరిస్థితులున్నాయని ప్రముఖ న్యాయవాది రామారావు పేర్కొన్నారు. 300 మంది విద్యార్థులకు ఒక మరుగుదొడ్డి ఉందని, ఉన్న ఒక్క మరుగుదొడ్డికి తాళం వేయడంతో ఇబ్బందులు పడుతున్నారని, అలాగే వంట గది నిర్మాణ పనులను ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ ఆపేయడం జరిగిందని, వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసు నమోదు చేసి విద్యాశాఖ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, వంట గది నిర్మాణం చేపట్టాలని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

నత్తనడకన ఇందిరమ్మ ఇళ్లు

- పైలెట్ ప్రాజెక్టుగా ఎర్రాపూర్
- మంజూరులో ముందు.. నిర్మాణంలో వెనుకంజ
- మండలానికి 466 ఇళ్లు.. నిర్మాణ దశలో ఉన్నవి కేవలం 77



ఎర్రాపూర్ తండాలో స్లాబ్ వరకు నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు

ఇబ్రహీంపట్నం: పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేసింది. ఈక్రమంలో ఇబ్రహీంపట్నం మండలంలోని 17 గ్రామాల్లో వందలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ కమిటీల సభ్యులు లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశారు. ఒక్కో గ్రామానికి 30 నుంచి 40 ఇళ్లు మంజూరు చేశారు. ఈనేపథ్యంలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనికితోడు ప్రతీ గ్రామంలో పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరు కావడంతో మేస్త్రీలు ఇదే అదనుగా భావించి ఇంటి నిర్మాణానికి ఎక్కువ డబ్బు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఆషాఢమాసం రావడంతో మంచి రోజులు లేక ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడంలేదని తెలుస్తోంది. దీంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

పైలెట్ ప్రాజెక్టుగా ఎర్రాపూర్

మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ఎర్రాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అధికారులు ఎంపిక చేశారు. ఇక్కడ 42 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కాగా, గ్రామంలో 21 ఇళ్లకు 8 నిర్మాణంలో ఉండగా, ఎర్రాపూర్ తండాలో కూడా 21 ఇళ్లకు 8 నిర్మాణ దశలో ఉన్నాయి. మిగతా లబ్ధిదారులు పనులు చేపట్టడం లేదు. పైలెట్ ప్రాజెక్టు గ్రామంలో ఇళ్లు వేగవంతంగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు అధికారులు రోజూ అవగాహన కల్పిస్తున్నారు.

మండలానికి 466 ఇళ్లు..

మండలంలోని 17 గ్రామాలకు 466 ఇళ్లు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలు కూడా అందజేశారు. కానీ, ఇప్పటి వరకు మండలంలో కేవలం 77 ఇళ్లు మాత్రమే నిర్మాణ దశలో ఉన్నాయి.

స్లాబ్ దశకు..



నా భర్త బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లారు. నేను కూలీ పని చేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్నాం. నాకు ఇల్లు లేదు. స్థలం ఉండడంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. స్లాబ్ దశ వరకు నిర్మించుకున్న.

– కుంట లావణ్య, ఎర్రాపూర్

అవగాహన కల్పిస్తున్నం



ఎర్రాపూర్ పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నందున ఇందిరమ్మ ఇళ్ల పనులను లబ్ధిదారులు వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నం. రోజూ వారి వద్దకు వెళ్లి తొందరగా నిర్మించుకోవాలని అవగాహన కల్పిస్తున్నం.

– మహేందర్, పంచాయతీ కార్యదర్శి, ఎర్రాపూర్

మంచి రోజులు లేక..



పనులు ప్రారంభించాలని లబ్ధిదారులకు ఎంత చెప్పినా మంచి రోజులు లేవని ప్రారంభించడం లేదు. అలాగే టెక్నికల్ సమస్యల వల్ల ఫొటో క్యాప్షన్ కాక ఆన్‌లైన్‌లో కనిపించక కొంత ఇబ్బంది అవుతుంది.

– చంద్రశేఖర్, ఎంపీడీవో

మొక్కు చెల్లించుకున్న ఎమ్మెల్యే అభిమాని



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్‌కుమార్ రెండోసారి గెలుపొందగా ఆయన అభిమాని జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన ఆది వెంకటేశ్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామికి 180 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గొడిశెల గంగాధర్, నారాయణ, బక్కన్న, మల్లేశ్, వెంకటేశ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాల జాతరలో ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: పట్టణంలోని నూకపల్లి డబుల్ ఇళ్ల కాలనీవాసులు గురువారం నిర్వహించిన పోచమ్మ బోనాల జాతరలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ అడువాల జ్యోతి, చెరుకు జాన్, చెట్‌పల్లి సుధాకర్ అంకం సతీశ్, ప్రభాత్‌సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

స్వశక్తి సంఘ సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



రెడీమేడ్ మెన్స్‌వేర్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ సునీత

జగిత్యాలరూరల్: జిల్లాలోని మహిళ స్వశక్తి సంఘ సభ్యులు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందిస్తోందని జిల్లా సెర్ప్ ఏపీడీ సునీత అన్నారు. జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని మహిళ సంఘ సభ్యులు ఏర్పాటు చేసుకున్న వివిధ యూనిట్లను గురువారం పరిశీలించారు. మోతె గ్రామానికి చెందిన సభ్యులు ఏర్పాటు చేసుకున్న రెడీమేడ్ మెన్స్‌వేర్, మహాలక్ష్మీ లేడీస్, మెన్స్‌వేర్, జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లికి చెందిన మహిళ సభ్యురాలు సునీత బ్యూటీ పార్లర్‌ను పరిశీలించి మాట్లాడారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతీ సభ్యురాలు రుణాలు తీసుకుని స్వయం ఉపాధి యూనిట్లతో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఆయా గ్రామాల్లోని సంఘాల వీవోఏలు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా నాన్ ఫామ్ ఏపీఎం కోల చక్రవర్తి, ఏపీఎం ఓదెల గంగాధర్, సీసీ రవీందర్, మోతె గ్రామ సంఘం అధ్యక్షురాలు లత, వీవోఏలు మమత, జనీత పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/కోరుట్లరూరల్: పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపుతూ సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం, వన మహోత్సవం తదితర అంశాలపై గురువారం పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో పెగడపల్లి కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీంపట్నంలో ఎంపీడీవో చంద్రశేఖర్, కోరుట్ల కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంచినీటి వనరుల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చేయాలని, పైపులైన్ లీకేజీలు లేకుండా చూడలన్నారు. వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలకు తాళం



తాళం వేసి ఉన్న పశు వైద్యశాల

కొడిమ్యాల: మండలకేంద్రంలోని పశువైద్యశాల ఉదయం 11.50 గంటలైనా తెరుచుకోలేదు. దీంతో ఆస్పత్రికి వచ్చిన పశు పెంపకదారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. వాస్తవానికి ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం నాలుగు వరకు తెరిచి ఉండాలి. కానీ.. 11.50 గంటలకు కూడా మూసే ఉంది. ఇదే విషయమై వెటర్నరీ వైద్యుడిని 'సాక్షి' సంప్రదించగా.. సిబ్బంది ఫీల్డ్‌లో ఉన్నారని తెలిపారు. సిబ్బందికి ఫోన్ చేస్తే ఒంటి గంట వరకు ఆస్పత్రిలోనే ఉన్నామని వివరించారు.

సూపర్‌వైజర్స్ జిల్లా యూనియన్ కమిటీ



నూతన కమిటీ సభ్యులు

జగిత్యాల: జిల్లాలోని ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ గ్రేడ్–1, గ్రేడ్–2 సూపర్‌వైజర్స్ యూనియన్ కమిటీ జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా మమత, ఉపాధ్యక్షురాలు శైలజ, కార్యదర్శి రాజశ్రీ, సంయుక్త కార్యదర్శి రాధిక, కోశాధికారి పవిత్ర, ప్రోగ్రాం ఆర్గనైజర్ లత, ఉమ, సహాయ కోశాధికారి భాగ్యలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా సుధారాణి, కుసుమ, స్వరూపరాణి, ప్రతిమను ఎన్నుకున్నారు.

బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉమామహేశ్



జగిత్యాలటౌన్: బీసీ న్యాయవాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా న్యాయవాది కూర్మాచలం ఉమామహేశ్‌ను నియామకం చేసినట్లు రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉమామహేశ్ మాట్లాడుతూ, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని, సంఘం బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా..



రమేశ్

మల్లాపూర్: బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా ఎనుగందుల రమేశ్ (పాతదాంరాజుపల్లి)ను నియమించినట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం నియామక పత్రం అందజేశారు. రమేశ్ మట్లాడుతూ, బీసీ హక్కుల సాధనకు నిరంతరం పోరాడుతానని, బీసీలను ఐక్యం చేసి బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా ముఖ్రిం

కోరుట్ల: సీపీఐ కోరుట్ల పట్టణ కార్యదర్శిగా ఎండీ ముఖ్రింను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, చెన్నా విశ్వనాథం, మౌలానా తదితరులు పాల్గొన్నారు.



కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్ శివారు అనంత పద్మనాభస్వామి ఆలయ సమీపంలో గల గుట్ట వద్ద కోతులకు ఆహారం కోసం పండ్ల మొక్కలు నాటి మంకీ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేశారు. కాగా, నాటిన మొక్కలను సంరక్షించడంలో నిర్లక్ష్యం చేయటంతో పూర్తిగా ఎండిపోయాయి. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ చూపి వర్షాకాలంలో మళ్లీ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఓదెల రామకృష్ణ, ఎంపీడీవో, సెల్ నంబర్: 98499 00097

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సకాలంలో చెల్లిస్తేనే లాభం

సారంగాపూర్: సారంగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంట రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లిస్తే 7 శాతం వడ్డీ మాత్రమే ఉంటుందని సీఈవో లైశెట్టి శివ పేర్కొన్నారు. పంట రుణాల వసూళ్లపై గురువారం సంఘ పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. రుణాల చెల్లింపులో జాప్యం జరిగితే అపరాధ వడ్డీ 13.75 శాతం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని రైతులు గుర్తించి ఈ నెల 30 లోపు రుణాలను చెల్లించాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది భూమేశ్, గంగారెడ్డి, వరుణ్ తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ధర్మపురిలో విద్యార్థుల మానవహారం



ఇబ్రహీంపట్నం: నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కోరుట్ల/కోరుట్లరూరల్/కథలాపూర్/మల్లాపూర్/మల్యాల/వెల్గటూర్/పెగడపల్లి/రాయికల్/మేడిపల్లి/ధర్మపురి/కొడిమ్యాల: అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పోలీస్, వైద్యశాఖల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విద్యార్థులతో ర్యాలీలు తీయించారు. కోరుట్ల పరిధిలో ఎస్సై రాంచంద్రంగౌడ్, కథలాపూర్‌లో వైద్యాధికారి సింధూజ, మల్లాపూర్ మండల కేంద్రంలో ఎస్సై రాజు, మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాణి, వెల్గటూర్‌లో సీఐ రాంనర్సింహారెడ్డి, పెగడపల్లిలో ఎస్సై కిరణ్‌కుమార్, భీమారం మండలం లింగంపేటలో ఎస్సై శ్యాంరాజ్, ధర్మపురి పట్టణంలో ఎస్సై ఉదయ్‌కుమార్, కొడిమ్యాలలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీలు తీశారు. ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు నాటిక రూపంలో ప్రదర్శన ఇచ్చారు. రాయికల్ మండలం రామాజీపేటలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

వన మహోత్సవం



ధర్మపురి: పట్టణంలోని గ్రంథాలయం ఆవరణలో గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్లు మొక్కలు నాటారు. మాజీ కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజు, మున్సిపల్ మేనేజర్ గంగాధర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు వీడ్కోలు

పెగడపల్లి: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని డీఈవో రామ్ అన్నారు. మండలంలోని అయితిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాగ్యవతి గురువారం ఉద్యోగ విరమణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారని, తమ పిల్లలను చేర్పించాలని కోరారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతు

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి– గుంలాపూర్ గ్రామాల మధ్య ఒర్రె కల్వర్టు మరమ్మతు పనులు గురువారం చేయించారు. గతేడాది కురిసిన వర్షాలకు ఒర్రె వద్ద కల్వర్టు కోతకు గురైంది. రెండు గ్రామాల ప్రజలు రాకపోకలకు, రైతులు పంట పొలాలకు వెళ్లడానికి ఇబ్బందిపడ్డారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ.3 లక్షలు ఇటీవలే మంజూరు చేయగా, స్థానిక నాయకులు చొరవతో పైపులు వేసి రోడ్డును చదును చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గూడు లేని పేదలకు నీడ కల్పించేందుకే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రూ.5లక్షలతో ఇంటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలతనర్సయ్య, మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

దారి మైసమ్మకు పూజలు

మల్యాల: మండలంలోని నూకపల్లిలో గురువారం రామన్నపేట, నూకపల్లి ఆటో యూనియన్ అధ్యక్షుడు మద్దినేని మురళి ఆధ్వర్యంలో స్థానిక మోడల్ స్కూల్ దారిలో ఉన్న మైసమ్మ గుడి వద్ద ఆటోలకు పూజలు చేసి వేడుకలు నిర్వహించారు.

ఒకరి ఆత్మహత్య

కొడిమ్యాల: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొడిమ్యాలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దాసరి వేణు (58) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో నల్లగొండ శివారు నర్సింహాస్వామి ఆలయం వద్ద మిషన్ భగీరథ ట్యాంకుకు ఉరేసుకున్నాడు. వేణు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగన్నాథస్వామి బ్రహ్మోత్సవాలు



సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామ శివారుల్లో నీలాచలకొండలపై వెలసిన శ్రీజగన్నాథస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. కొండపై స్వయంభూగా వెలసిన శ్రీ నీలాదేవి, భూదేవి సహిత శ్రీజగన్నాథస్వామి బ్రహ్మోత్సవాలు జూలై 1 వరకు జరగనున్నాయి. 27న వైనతేయ ఇష్టి, ధ్వజారోహణం, బలిహరణం, సాయంత్రం దేవతాహ్వానం, 28న విద్యాప్రాప్తికి హయగ్రీవ ఇష్టి, సుదర్శనహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయి. 29న శ్రీభూదేవి, నీలాదేవి సమేత స్వామివారి కల్యాణం, 30న మహాలక్ష్మీ ఇష్టిహోమం, కుంకుమార్చనలు, జూలై 1న రథోత్సవం, చక్రతీర్థం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నాయి.



పెద్దమ్మతల్లి బోనాలు

కోరుట్లరూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలో గురువారం పెద్దమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.